# ఉభయులు

మల్లయ్య మహాకాయుడు. మహాకాయుడంటే ఏదో ఆషామాషీ కాదు. విశ్వనాథవారు చెప్పినట్టుగా.

"నల్లగా కటిమొద్దువలె నుండును. చంద్ర మొద్దు. అతని మేలిఛాయ ఎఱుపు కలిసిన నలుపుతాడి చెట్టంత ఎత్తున్నాడు. అనగా సుమారు ఏడడుగుల ఎత్తు మానిసి. వాని ఒక భుజము నుంచి మరియొక భుజము వరకు గజమున్నర వుండును. వాని ఱొమ్ము కొలత – అడివిలో పెనుగాలికి పడిపోయిన నాలుగు వందల ఏండ్లు బ్రతికిన మఱ్ఱి చెట్టు మొదలంత వున్నది. ఆ మొగమునందున్న నేత్రములు కణకణలాడు రెండు కుంపటులు."

అలా వుంటాడు మల్లయ్య. భయమంటే ఎరగడు. అతని నడకధాటికి దారి పక్కనున్న చెట్ల పళ్ళు నేలరాలతాయి. గొడ్లు గుడ్లు తేలేస్తాయి. అతను గొంతెత్తి "ఎవడ్రా అది!" అని అరిచాడంటే ఎలా వుంటుందో చెప్పనా?

పూర్వం బందరులో మధ్యాహ్నం పన్నెండు గంటలకి ఫిరంగి పేల్చేవారు. ఫిరంగి పేల్చడానికి రోజూ చాలా మందుగుండు ఖర్చవుతోందని భావించి – మల్లయ్యని అక్కడ కూర్చోబెట్టి, ఆ సమయానికి ఒక కేక పెట్టిస్తే ఎలా వుంటుందని ఆలోచించారట బ్రిటిష్ వాళ్ళు! అఫ్‌కోర్స్ – అతన్ని పోషించడానికి అయ్యే ఖర్చుతో రోజూ మూడు ఫిరంగులు పేల్చవచ్చని గ్రహించి ఆ ప్రయత్నం విరమించుకున్నారనుకోండి. అది వేరే విషయం అదిగో అది మల్లయ్య గొంతు!

మధ్యాహ్నం పద్నాలుగు కంచాలు లాగించి. సాయంత్రం దాకా విశ్రాంతి తీసుకుని - సాయంత్రం తాడిచెట్లు తనిఖీ చేసి, రాత్రికి ఇరవై కంచాలు లాగించి, పొలానికి కాపలా పడుకుని - ప్రొద్దున్నే పద్దెనిమిది ముంతలు కల్లు సేవించి యింటికొచ్చి పది కంచాలు లాగించి మధ్యాహ్నం దాకా పడుకోవడం - ఇదీ మల్లయ్య ప్రతి దినచర్య.

ఉన్న పన్నెండున్నర ఎకరాలలో - మల్లయ్య పోషణార్థం పది ఎకరాలు, మిగిలిన కుటుంబ పోషణార్థం రెండున్నర ఎకరాలు సరిపోతాయి. చుట్టూ వున్న తాడి చెట్లలో స్పెషల్‌గా కొన్ని తాడిచెట్లు మల్లయ్య కోసం పెద్ద సైజు ముంతలు మోస్తూ వుంటాయి.

అయితే, రెండు రోజులుగా రెండు చుక్కలు కూడా గొంతు దిగలేదు మల్లయ్యకి. పొద్దున్నే కలకత్తా కాళిక ఖాళీ నాలిక లాగా వెర్రి మొహాలేసుకుని నిలబడుతున్నాయి తాడిచెట్లు! తాడి ఎత్తున చిర్రెత్తుకొస్తోంది మల్యకి. "ఎవడైనా దొంగ నా కొడుకు కన్నేశాడా? గుండా? చెరువా? అయినా ఎంత వోడైనా రెండు, మూడు ముంతలు కన్నా తాగి చావలేడే ఈ చుట్టుపట్ల! ఇన్ని ముంతలు ఖాళీ అవుతున్నాయంటే ఇది ఎవడో ఒకడి పని కాదు. పది పన్నెండు మంది ఎదవలు కలిపి సేత్తున్న పని! అయినా సెట్లెక్కి తాగేసి అంత మంది నా కొడుకులు ఎల్లిపోతుంటే, మెలకువ రానంత మొద్దు నిద్ర కాదే నాది! ఇదేదో సిత్రంగా వుంది కానీ ఈ రాత్రికి సెప్తా దీని..." అనుకుంటూ చేతి రోకలి గడ్డం క్రింద అనించి తాటి తోపులకేసి చూస్తూ కొద్దిసేపట్లో మెల్లిగా నిద్రలోకి జారాడు మల్లయ్య.

★ ★ ★

అదో చిత్రం! గడ్డం క్రింద చేతి రోకలి (అదే అతనికి చేతి కర్ర) ఆనించి నిలబడి నిద్రపోతాడు. దూరం నుంచి చూసే వాడికి అతను మేలుకున్నట్టే వుంటుంది.

ద్వాదశి చంద్రుడు మసక మసగ్గా వెలుగుతున్నాడు. దర్జాగా చేతులూపుకుంటూ ఓ చెట్టు కిందకొచ్చాడు పుల్లయ్య! పేరుకి తగ్గట్టే పుల్లలా సన్నగా, పొడుగ్గా వుంటాడు పుల్లయ్య! రంగదాసుగారి తాలింఖానాలో... సాముగరిడీలకి పులయ్య పెట్టింది పేరు! భయం అనేది ఎరగడు. చేతులు నేలకి ఆనకుండా పిల్లి మొగ్గలేస్తూ పరుగు దూరం పోగల సమర్థుడు! మనిషి పుల్లలావున్నా వడ్డించేవాళ్ళని హర్లిగింతలు పెట్టించగలడు.

అతని పొట్ట దొంగ పొట్ట! మడతల పొట్ట! మడతలకి మణుగు పడుతుందని ప్రతీతి. మందులో మటుకు పానకాల స్వామే!



కోతల రోజుల్లో శిష్యగణాలతో ఊరూరా తిరిగి, ప్రదర్శనలిస్తుంటాడు రంగదాసుగారు, ప్రదర్శన రోజుల్లో మందు పడందే ముందు పడలేదు పుల్లయ్య! ఈ ఊరు వస్తూనే మల్లయ్య చెట్లమీద కన్నేశాడు! గురువుగారికి తెలీకుండా తెల్లవారుఝామున వచ్చి రెండ్రోజులుగా మందు ముంతలు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నాడు. ఈ ఊళ్ళో ఇక ఇదే ఆఖరి రోజు!

ఇవాళ కొద్దిగా ఆలస్యమైంది. గబగబా పది ముంతలు ఖాళీ చేశాడు. పదకొండో ముంత అందుకోబోతుండగా తొలికోడి కూసింది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు మల్లయ్య. కళ్ళు చిట్లించి, చుట్టూ పరకాయిచి చూశాడు.

దూరంగా తల్లి తాడి మీద ఏదో ఆకారం కదిలినట్టయింది. ఒరేయ్ అని కేకేసి అటు అడుగులు వెయ్యసాగాడు.

ఆ అరుపుకు అదురుకున్న పుల్లయ్య కింద పడబోయి, తమాయించుకుని చూస్తే తనకేసి వస్తున్న ఓ పెద్ద తుమ్మమొద్దు! దాని నడకకి ఇక్కడ చెట్టు అదురుతోంది. ఆ కేక, ఆ ఆకారం, ఆ అదురుడు బాబోయ్ ఇదేదో బ్రహ్మరాక్షసి! నిర్భయుడైన పుల్లయ్య ఝుడుసుకున్నాడు. అంత తాడిచెట్టు మీంచి ఒక్కసారి దూకేశాడు. దూకుతూ తలగుడ్డ నాలుగంచులూ రెండు వైపులా గుమ్మటంలా పట్టుకున్నాడు. పిల్లిలా నేల మీద ఆని, కొంత దూరం ముందుకి మొగ్గలేశాడు. కొంచెం ముందుకి వస్తే కాని ప్రక్కకి వెళ్ళే దారి లేదు. ఆ చెట్ల తోపులో అటుపైన కుడి ప్రక్కకి అడ్డం తిరగాలి.

నేల అదిరేట్టు నడుస్తున్న మల్లయ్య ఆ దృశ్యం చూసి అదురుకున్నాడు. తాడి చెట్టు మీంచి దూకిన ఆకారం తనకేసి దొర్లుకుంటూ వస్తోంది. బాబోయ్! ఇదేదో బ్రహ్మరాక్షసి! కాకపోతే ఇన్ని ముంతల కల్లు తాగగలదా? అంతెత్తు మీంచి దూకగలదా??

వెనక్కి తిరిగిన మల్లయ్య అఘమేఘాల మీద ఇంట్లోకిపోయి పడ్డాడు.

అడ్డం తిరిగిన పుల్లయ్య విడిదిలో పోయి పడ్డాడు.

మర్నాడు పుల్లయ్య, గాలిగోపురం మీంచి క్రిందికి దూకే సాహస ప్రదర్శన ఇచ్చాడు. సామాన్యంగా ప్రదర్శనలకే రాని మల్లయ్య ఎందుకో ఆ రోజు పరుగు పందెంలో పాల్గొని ఫస్టొచ్చాడు. ఊరంతా ఆశ్చర్యపోయింది. మల్లయ్య పరుగూ, పుల్లయ్య దూకూ.